బండారి కూతురు వివాహం.. కేసీఆర్‌కు ఆహ్వానం

ఈ నెల 15వ తేదీన జరిగే తన కూతురు వివాహానికి రావాలని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవల్లిలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. – రామంతాపూర్, ఫిబ్రవరి 2

దివ్యాంగుడి కుటుంబం ఔదార్యం

పటాన్‌చెరు, ఫిబ్రవరి 2 : దివ్యాంగ కుమారుడు మృతి చెందటంతో అతడు వాడుతున్న బ్యాటరీ వీల్‌చైర్‌ను మరో దివ్యాంగుడికి అందజేసి ఔదార్యాన్ని చాటారు. ఆదివారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రవి కుమార్ కార్యాలయం వద్ద తెల్లాపూర్ గ్రామానికి చెందిన రేహాన్‌కు బ్యాటరీ వీల్‌చైర్‌ను అందజేశారు. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలం గంగ్వాడ గ్రామానికి చెందిన నాగరత్నంగౌడ్ కుమారుడు శివ దివ్యాంగుడు. శివ ఇటీవల మృతి చెందాడు. అతడి జ్ఞాపకార్థంగా వదిలివెళ్లిన బ్యాటరీ వీల్‌చైర్‌ను మరో దివ్యాంగుడికి ఇచ్చేందుకు నాగ రత్నంగౌడ్ కుటుంబం నిర్ణయించి రవికుమార్‌కు విషయం తెలిపారు. స్పందించిన రవికుమార్ బ్యాటరీ వీల్‌చైర్ అవసరమైన రెహాన్‌కు అందించారు. ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. యువ చైతన్య ఇస్నాపూర్ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కంచిగారి మహేశ్, కర్ల జ్యోతి, బాపు వెంకన్న, కంచిగారి శ్రీనివాస్, వెంకో బా, ముక్తార్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బ్యాటరీ వీల్‌చైర్‌ను అందజేస్తున్న కుటుంబీకులు

నగరంలో చెత్తశుద్ధి ఇదేనా..?

హైదరాబాద్ మహా నగరం.. ఓ విశ్వ నగరం. అందుకు ఇక్కడ దర్శనమిస్తున్న ఆనవాళ్లే.. నిదర్శనం. నగరంలో ఎక్కడ చూసినా.. ఇదే తంతు. పాలక ప్రభుత్వం, అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నాయి. అందుకూ ఇక్కడ కనిపిస్తున్న దృశ్యమే.. ప్రత్యక్ష సాక్ష్యం. వీటి వల్ల ప్రజల ఆరోగ్యం ఏంగాను? స్థానికంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను పట్టించుకునే వారే కరువయ్యారు. కంటోన్మెంట్ పరిధిలోని అన్నా నగర్ బస్తీలో ప్రధాన రహదారిలో ఆదివారం చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. స్థానికంగా ముక్కు పుటలు అదిరేలా దుర్గంధం రాజ్యమేలుతోంది. చెత్త పోగవడంతో ఈగలు, దోమల మోతకు కొదవలేదు. పైగా, పందులు, పందికొక్కుల సంచారం కూడా ఇక్కడ అధికం. ఈ నేపథ్యంలో స్థానికుల ఇబ్బందులు వర్ణనాతీతం అయ్యాయి. పాలక ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లు చెప్పడంలోనే తలమునకలై తూగుతోంది. ఎవరెక్కడ పోతే.. నాకేంటి అన్న ధోరణిలో ప్రభుత్వాధినేతలు ఉన్నారు. అందుకు, వారి పాలనా తీరుకు ఇవే నిదర్శనాలు. కళ్లు మూసుకుపోయి ఉన్న ప్రభుత్వ పెద్దలు, అధికార యంత్రాంగం ఇకనైనా ప్రజల గోడును పట్టించుకుంటే.. బాగుంటందని సూచన!

ప్రపంచ యవనికపై రాణించేందుకు ఇంగ్లిష్ కీలకం

సింగరేణి సీఎండీ బలరాం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 2: ఇంగ్లిష్ భాషను అందరు కష్టపడి నేర్చుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సింగరేణి సీఎండీ బలరాం అన్నారు. విద్యార్థులు ప్రపంచ యవనికపై రాణించాలంటే భాషా నైపుణ్యం అత్యంత కీలకమని చెప్పారు. విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడం ద్వారా అయా రంగాల్లో రాణించేందుకు సులువవుతుందని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ సెంటర్ (ఈఎల్‌టీసీ) ద్వారా గిరిజన విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఆదివారం ముగిసింది. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 66 మంది యూజీ చదువుతున్న గిరిజన విద్యార్థులకు ఈ కార్యక్రమంలో భాగంగా స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ అందించారు. విద్యార్థులకు ఓయాలో నెలరోజుల పాటు వసతి కల్పించి, శిక్షణ అందించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ఆర్థిక సహాయం అందజేశారు. ఓయూ ఆర్ట్స్ కళాశాలలోని ఈ క్లాస్ రూంలో నిర్వహించిన కార్యక్రమ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బలరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని మారుమూల గిరిజన ప్రాంతాలలో విద్యాభివృద్ధికి, లైబ్రరీల ఏర్పాటుకు సింగరేణి తరపున ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన గిరిజన సమూహాలకు కూడా విద్యాభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తామన్నారు. అన్ని సమస్యలకు విద్య మాత్రమే పరిష్కారం చూపుతుందని అన్నారు. సాధికారత సాధించేందుకు సుస్థిర విద్యాభివృద్ధి ఎంతో ముఖ్యమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఈఎల్‌టీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ, కార్యక్రమ కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ సవిన్ సౌడ, ప్రొఫెసర్ క్రిస్టోఫర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం, ప్రొఫెసర్ పరిమళ కులకర్ణి, డాక్టర్ మాధవి, డాక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం, చిత్రంలో తదితరులు

త్వరలో ల్యాండ్ పూలింగ్ షురూ..

- తొలి దశలో 900 ఎకరాల్లో మూడు వెంచర్లు
- కసరత్తు చేస్తున్న హెచ్ఎండీఏ యంత్రాంగం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ పరిధిలో ల్యాండ్ పూలింగ్‌పై దృష్టి సారించింది. ఇప్పటికే కొన్ని అనువైన ప్రాంతాలను ఎంపిక చేయగా.., వచ్చే రెండు నెలల్లో పనులు మొదలు కానున్నాయి. ఇప్పటికే గుర్తించిన ప్రాంతాల్లో భూ యజమానులతో సంప్రదింపులు చేస్తుండగా.., కొందరరు రైతులు నేరుగా భూములిచ్చేందుకు అంగీకరించారు. ఈ క్రమంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో తొలి దశలో 900 ఎకరాల విస్తీర్ణంలో భారీ స్థాయిలో మూడు వెంచర్లను డెవలప్ చేయడంపై హెచ్ఎండీఏ కసరత్తు చేస్తోంది.

సాగుతున్న భూ సమీకరణ..

హెచ్ఎండీఏ పరిధిలో రైతుల నుంచి సేకరించిన భూములను డెవలప్ చేసి విక్రయించాలని భావించింది. ఇందుకు ప్రతిపాదించిన కొర్రెముల, ప్రతాప సింగారం, బోగారం, దండు మల్కాపూర్ వంటి ప్రాంతాలను ఎంపిక చేసుకున్నది. ప్రస్తుతం, ఆ ప్రాంతాల్లో భూ సమీకరణ వ్యవహారాలు సాగుతుండగా.., రెండు నెలల వ్యవధిలో పనులు మొదలు కానున్నాయి. రైతులకు వాటా 60 శాతం మేర డెవలప్ చేసిన ప్లాట్లను ఇవ్వనుండగా.., ఇప్పటికే హెచ్ఎండీఏకు భూముల తీసుకునేందుకు రైతులతో సంప్రదింపులు ముమ్మరం చేశారు.

సంప్రదింపులతో.. సమీకరణ పూర్తి

నగరం చుట్టూ ఉండే ప్రతాప సింగారం, కొర్రెముల, భోగారం, లేమూరు, దండు మల్కాపూర్ వంటి ప్రాంతాల్లో ఇప్పటికే 900ల ఎకరాలకు పైగా భూమిని డెవలప్‌మెంట్ కోసం గుర్తించారు. భూ యజమానులను ఒప్పించి 60-40 రేషియోలో డెవలప్‌మెంట్ ఖర్చులతో లే అవుట్లుగా హెచ్ఎండీఏ తీర్చిదిద్దనుంది. అయితే, స్థానికంగా భూముల ధరలు పెరగడం, హెచ్ఎండీఏ ఇచ్చే వాటా సరిపోకపోవడం, డెవలప్‌మెంట్ పేరిట జరిగే జాప్యం వంటి అంశాలతో భూ సమీకరణ ఆలస్యం అవుతుండగా.., ఒకవేళ ప్రాజెక్టు మొదలుపెడితే నిర్ణీత గడువు ప్రాతిపదికన డెవలప్‌మెంట్ పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఓ వైపు వెంచర్ డెవలప్‌మెంట్ పనులు ఆలస్యమైతే... సకల సదుపాయాలతో లే అవుట్లు డెవలప్ అయ్యే నాటికి అక్కడ భూముల ధరలు పెరగడంతో... అనుకున్నంత మేర పరిహారం రావడం లేదనే భావనలో రైతులు ఉన్నారు. దీంతోనే భూములు ఇచ్చేందుకు వెనుకడుగు వేస్తుండగా.., వారితో ల్యాండ్ పూలింగ్ అధికారులు సంప్రదింపులు చేస్తున్నారు. రైతులకు లాభదాయకంగా ఉండాలన్న భావనలున్నట్టు తెలుస్తుంది.

విద్యార్థులకు వైద్య పరిజ్ఞానం అందించడమే లక్ష్యం

ఆరు రోజుల శిక్షణ ముగింపులో పతంజలి యూనివర్సిటీ వీసీ బాలకృష్ణ



శిక్షణ పొందిన వారికి పతంజలి ధ్రువ పత్రాలను అందిస్తున్న వీసీ బాలకృష్ణ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2(నమస్తే తెలంగాణ): విద్యార్థులకు చరక సంహితకు సంబంధించిన ప్రామాణికమైన వైద్య పరిజ్ఞానం, సాధన ఔచిత్యాన్ని అందించడమే చరకాయతన్ ముఖ్య ఉద్దేశమని పతంజలి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ బాలకృష్ణ అన్నారు. రాష్ట్రీయ ఆయుర్వేద విద్యాపీఠ్, ఆయుష్ మంత్రిత్వ శాఖ నేతృత్వంలో పతంజలి ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో ఆయుర్వేద ఉపాధ్యాయులు, పోస్ట్ గ్రాడ్యుయేట్స్, పండితులకు నిర్వహించిన ఆరు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం చరకాయతన్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా పతంజలి యూనివర్సిటీ వీసీ బాలకృష్ణ మాట్లాడుతూ ఆయుర్వేదంతో అనుసంధానం అయ్యే అవకాశం రావడం మన అదృష్టమన్నారు. ఆయుర్వేదం జీవనోపాధి మాత్రమే కాదని, మన ప్రవర్తన, స్వభావం వంటివి జీవితంలో ఆయుర్వేదం కనిపించాలన్నారు. వైద్య సామర్థ్యంతో పాటు ఆయుర్వేద సామర్థ్యం ఎంతో విస్తృతమైనదని అన్నారు. అనంతరం, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ఆయుర్వేదంతో పాటు యోగాని పతంజలి వాస్తవాలను ఆధారాలతో నిరూపించిందన్నారు. సమావేశంలో పలువురు విద్యావేత్తలు, శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ఉండాలి

లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ

కార్యక్రమంలో మాట్లాడుతున్న జయప్రకాశ్ నారాయణ

ఖైరతాబాద్, ఫిబ్రవరి 2: కేంద్ర బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉండాలని లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ అన్నారు. సోమాజిగూడలోని ఆస్కీలో 'యూనియన్ బడ్జెట్' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ దేశంలో పేదరికం నిర్మూలన జరుగలేదని, ప్రజలకు నిజంగా ఏం అవసరం ఉంటుందో పాలకులు తెలుసుకొని వాటిని అమలు చేయాలన్నారు. దేశంలో నేటికీ 46 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఆ రంగానికి ప్రాధాన్యతనిస్తూ, విద్య, ఉపాధిపై శ్రద్ధ చూపాలన్నారు. ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ ఎడిటర్ డాక్టర్ ఎస్.మహేంద్రదేవ్ మాట్లాడుతూ, అంతర్జాతీయ అనిశ్చితిల నేపథ్యంలో దేశ బడ్జెట్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, ఎగుమతులపై దృష్టి సారించాలన్నారు. ఈ సదస్సులో ఆస్కీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రమేశ్ కుమార్, కోర్ట్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ కె.పద్మనాభయ్య పాల్గొన్నారు.



ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న వేణు మాధవ్

డీఆర్‌యూసీసీ సభ్యుడిగా వేణు మాధవ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2(నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ (డీఆర్‌యూసీసీ) సభ్యుడిగా వేణుమాధవ్ నియమితులయ్యారు. తన నియామకానికి బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సిఫారసు చేశారని వేణు మాధవ్ తెలిపారు. కృష్ణయ్య చేతుల మీదుగా ఆదివారం నియామక పత్రాన్ని అందుకున్నారు. వేణు మాధవ్ డీఆర్‌యూసీసీ సభ్యుడిగా రెండేళ్లు కొనసాగనున్నారు.

హక్కులు వినియోగించుకొని అభివృద్ధిని సాధించాలి

తెలంగాణ పోస్టల్ గిరిజన ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు, ఉద్యోగ సంఘాల నేతలు

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 2: రాజ్యాంగం కలిపించిన హక్కులను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాలలో గిరిజనులు అభివృద్ధిని సాధించాలని వక్తలు పిలుపునిచ్చారు. పోస్టల్ గిరిజన ఉద్యోగుల తెలంగాణ సర్కిల్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో గిరిజనుల ఆత్మీయ సాంస్కృతిక సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేషనల్ షెడ్యూల్ ట్రైబ్స్ కమిషన్ మెంబర్ జాటోతు హుస్సేన్ నాయక్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ పాల్గొని మాట్లాడారు. ఐకమత్యంతోనే ఏ రంగంలోనైనా రాణించవచ్చని అన్నారు. ఆర్థికంగా గిరిజనులు ఎదగాలంటే ఉన్నత విద్యలను అభ్యసించేలా పిల్లలను ప్రోత్సహించాలని వారు సూచించారు. రాజకీయ పార్టీలు గిరిజనులకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో అధికంగా టికెట్లు కేటాయించాలని కోరారు. గగిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, ఆల్ ఇండియా పోస్టల్ గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎం.జె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గుగులోతు రవి, అసిస్టెంట్ సెక్రటరీ ఆర్.మంజునాథ్, ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పి.వి రమణ, కోశాధికారి పులిశెట్టి నాగరాజు, ఆంధ్రప్రదేశ్ ఎరుకల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు మోహన్ కుమార్ ధర్మ, వివిధ సంఘాల నేతలు, మేధావులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం..

తెలంగాణ సర్కిల్ పోస్టల్ గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా బద్రు నాయక్ ధనావత్, కార్యదర్శిగా గుగులోతు రవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేతావత్ శివ నాయక్, కోశాధికారిగా మేడ నాగ సురేష్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, అనంతరం వారిని ఘనంగా సత్కరించారు.

ఉత్సాహంగా.. రన్ ఫర్ గర్ల్ చైల్డ్

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 2: తెలంగాణకు చెందిన సేవా భారతి ఆధ్వర్యంలో బాలికల సాధికారిత, కిశోర్ వికాస్ కార్యక్రమ అవగాహన కోసం గచ్చిబౌలిలోని స్టేడియంలో ఆదివారం రన్ ఫర్ గర్ల్ చైల్డ్-2025 కార్యక్రమం నిర్వహించగా, ఎంతో ఉత్సాహంగా సాగింది. 5, 10, 21 కిలో మీటర్ల పరుగు పందెంలో కార్పొరేట్, ఐటీ సంస్థలకు చెందిన ఉద్యోగులు, వివిధ కళాశాలలు, విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు వేలాది మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, సీఎస్సీ ఐఏఎస్ అకాడమీ చైర్ పర్సన్ బాలలత, ఫ్రీడమ్ అయిల్ జీఏం చేతన్, గ్లోబల్ డేటా డైరక్టర్ రాజీవ్ గుప్తా, ఇన్ఫోసిస్ సీఎస్ఆర్ హెడ్ వంశీ పరంజ్యోతిలతో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెరిగిన ఉష్ణోగ్రత, ఆదివారం సెలవు కావడంతో వెలవెలబోతున్న ట్యాంక్‌బండ్ రోడ్డు